క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

మద్దికెర : మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో నిర్మాణంలోనున్న కృష్ణుడి దేవాలయ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ పద్మావతి, గూడురు ధనుంజయుడు కుమారులు సాయితేజ, మణితేజ రూ.1,11,000 ఆలయ నిర్వాహకులకు మంగళవారం అందజేశారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు అందజేసిన ఎస్ రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ

పత్తికొండ(తుగ్గలి) : రాయలసీమ యూనివర్శిటీలో ఈ నెలలో నిర్వహించే ఫుట్‌బాల్ పోటీలకు వెళ్లనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ ఎస్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ దంపతులు మంగళవారం క్రీడా దుస్తులు అందజేశారు. వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడల్లో పతకాలు సాధించి పత్తికొండకు, కాలేజీకి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి చూపాలి

చిప్పగిరి: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వంలో చేపట్టిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ అల్లాబకాష్ గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మన ఇల్లు – మన గౌరవంలో భాగంగా వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు మార్చి ఆఖరులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఏఈ భవ్య, పంచాయతీ కార్యదర్శులు సురేంద్ర, నాయక్, సుధీర్,వర్క్ ఇన్‌స్పెక్టర్ కుమార్,ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను నివారించాలి

మద్దికెర : మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలని ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక వైద్యశాలలో ఆశాడే నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ కాన్పులు ప్రభుత్వ వైద్యశాలల్లోనే చేయించుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్యశాలల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, ఆరోగ్య ఉపర్యవేక్షకులు కృష్ణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు హామీని నిలబెట్టుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబిరసూల్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాయలంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇస్తామని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా పట్టించుకోవడం లేదున్నారు. ఉచితంగా స్థలంలో ఇవ్వడంతోపాటు రూ. 5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలన్నారు. బోయ బొంతిరాళ్ల గ్రామ సర్పంచ్ రవిమోహన్, సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ, సహాయ కార్యదర్శి రాజు, మహిళా సమైఖ్య నాయకురాలు శకుంతలమ్మ పాల్గొన్నారు.

భక్తుల గదులు ఖాళీ చేయండి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద భక్తుల కోసం దాతలు నిర్మించిన గదులను సిబ్బంది ఖాళీ చేయాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేవాలయానికి వచ్చే భక్తుల కోసం నిర్మించిన గదుల్లో కార్యాలయంలో పని చేసే కొంత మంది సిబ్బంది పర్మినెంట్‌గా ఉండడం ఇక నుంచి కుదరదన్నారు. ఈనెల 10వ తేదీకంతా వాటిని ఖాళీ చేయాలని ఆదేశించించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కౌతాళం: పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని హాల్వి గ్రామంలో పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.6,500వ గదుతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండుకు పంపినట్లు వెల్లడించారు. మండలంలో ఎవరైనా అసాంఘిక , చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాడు ప్రాధాన్యం.. నేడు నిర్వీర్యం!

- వైఎస్సార్‌సీపీ హయాంలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌ల భవనాల నిర్మాణాలు
- నాడు ప్రాధాన్యతగా భావించి వేగంగా నిర్మాణాలు
- వివిధ దశల్లో నిలిచిన భవనాల నిర్మాణాలను గాలికొదిలేసిన కూటమి సర్కారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు గ్రామం ముంగిటే సేవలన్నీ అందాలని నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా పల్లెల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు నిధులు విడుదల చేసి ప్రాధాన్యతగా తీసుకొని భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే వివిధ కారణాల వల్ల కొన్ని చోట్ల నిర్మాణాలు ఆలస్యమయ్యాయి. ఈలోపు ఎన్నికల్లో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో మధ్యలో నిలిచిపోయిన భవనాల నిర్మాణాలను గాలికొదిలేసింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలు సరిగా అందడం లేదు.

పత్తికొండ(తుగ్గలి) : గత ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనా పల్లె ముంగిటకు వచ్చింది. ప్రతి పనికీ మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారు. రేషన్‌తో సహా అన్ని సేవలు ఇంటి వద్దకే అందుబాటులోకి తీసుకొచ్చారు. జనన, మరణ ధ్రువ పత్రాలు మొదలుకొని అన్ని రకాల సేవలను గ్రామంలోనే అందించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లపై కత్తి కట్టింది. వాటి నిర్మాణాల్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోంది.

సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా..

ఆరు నెలల క్రితం వరకు గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేసి నిరాటకంగా సేవలందాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థపై విషం చిమ్ముతున్నారు. గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అసూయతో నిర్మాణంలో ఉన్న భవనాలను అర్ధాంతరంగా నిలిపివేశారు. సచివాలయ వ్యవస్థకు వ్యతిరేకం కాదంటూనే భవన నిర్మాణాలను నిలిపివేసి వ్యవస్థను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నారు. అసంపూర్ణంగా ఉన్న భవన నిర్మాణాల జోలికి వెళ్లకుండా ప్రభుత్వం కాలం వెళ్లదీస్తోంది.



బొందిమడుగులలో నిలిచిన సచివాలయ భవన నిర్మాణం



చెన్నంపల్లిలో 95 శాతం పూర్తయిన సచివాలయం భవనం

ఎక్కడి పనులు అక్కడే..

గత ప్రభుత్వ హయాంలో గ్రామ పాలన దిశగా అడుగులు పడ్డాయి. అందులో భాగంగా నియోజకవర్గానికి 75 సచివాలయ భవనాలు మంజూరు కాగా 56 పూర్తి చేశారు. మొత్తం రూ.30 కోట్లకు గాను రూ.23.35 కోట్ల పనులు పూర్తి చేశారు. ఆర్‌బీకేలు 75 మంజూరు చేయగా వాటిలో 55 పూర్తి చేశారు.రూ.16.33 కోట్లకు గాను రూ.12.07 కోట్లు ఖర్చు చేశారు. హెల్త్ క్లినిక్‌లకు 68 గాను 39 అందుబాటులోకి తెచ్చారు. మొత్తం రూ.11.09 కోట్లకు గాను రూ. 6.82 కోట్లతో ఆ భవనాలను నిర్మించారు. అన్ని ప్రాధాన్యత భవనాలు కలిపి 218 మంజూరు కాగా అందులో 150 భవనాలు నిర్మించి రూ.42.24 కోట్లు వెచ్చించారు. సచివాలయాలు 19, ఆర్‌బీకేలు 20, హెల్త్ క్లినిక్‌ల భవనాలు 29 వివిధ దశల్లో ఆగిపోయాయి. చాలా చోట్ల నిర్మాణాలు చివరి దశకు రాగా మరికొన్ని కోట్ల చిన్న చిన్న పనులతో మిగిలిపోయాయి. వాటిని పూర్తిచేసి వినియోగించుకోవాలని ప్రస్తుత ప్రభుత్వం ఆలోచించకపోవడంతో నిర్మాణాలు పూర్తి కావడం లేదు. ఇక పూర్తయిన భవనాలు కూడా ప్రారంభానికి నోచుకోవడం లేదు. మిగిలిన భవనాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా వాటిని పూర్తి చేసే చర్యలపై కూటమి సర్కారు ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. గతంలో ఒక్కో గ్రామ సచివాలయం ద్వారా వేల సంఖ్యలో ధ్రువ పత్రాలు జారీ చేసేవారు. సచివాలయాల ద్వారా వేలాది మంది సిటిజన్ చార్టర్ ద్వారా సేవలు అందుకున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందించేవారు. 2019 ముందు వరకు వాటి కోసం మండలాల్లో రైతులు బారులు తీరడం, ధర్నాలు చేయడం వంటి పరిస్థితి ఉండేది. వాటన్నింటికీ రైతు భరోసా కేంద్రాల ద్వారా పరిష్కారం లభించింది. ప్రస్తుతం దశల వారీగా ఈ వ్యవస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి.

భవనాలు పూర్తిచేయాలి



సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుతున్నాయి. మండల కేంద్రానికి వెళ్లే పరిస్థితి లేకుండా అన్ని పనులు ఊర్లోనే చక్కబెట్టుకో వచ్చు. అలాంటి వ్యవస్థకు సంబంధించి భవనాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. బిల్లులు ఇచ్చి వాటిని వెంటనే పూర్తిచేస్తే బాగుంటుంది. ప్రజలకు అవస్థలు తప్పుతాయి. – చంద్రన్న, ముక్కెళ్ల

పూర్తయిన వాటిని అప్పగించాం

నియోజకవర్గంలో పూర్తయిన భవనాలన్నీ ఆయా శాఖలకు అప్పగించాం. అసంపూర్తి భవనాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి సమాచారం లేదు. రాగానే వెంటనే భవన నిర్మాణాలు పూర్తి చేస్తాం.
– శేషయ్య, పీఆర్ డీఈ, పత్తికొండ



చెన్నంపల్లిలో ప్రారంభానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

పంటల బీమా చేయించుకోవాలి

తుగ్గలి : రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని ఏఓ పవన్‌కుమార్ కోరారు. మంగళవారం మారెళ్ల, ముక్కెల్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. బీమా చేసుకోవడం వల్ల అకాల వర్షాలకు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పుడు పంట నష్టపోయిన రైతులకు బీమా రక్షణగా ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, ఎంపీఈవో సోమేశ్వరి, వీఏఏలు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలో రబీ సీజన్‌లో పంటలను సాగుచేసిన రైతులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని కేవీకే శాస్త్రవేత్త రాఘవేంద్ర, ఏడీఏ సునీత సూచించారు. మంగళవారం మండలంలోని గూళ్యం, చింతకుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగుచేసిన జొన్న, శనగ పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండల యూనిట్ ప్రకారం ఎకరాలో శనగ పంటకు రూ.420 గ్రామ యూనిట్‌గా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం రైతులకు స్థానిక రైతుసేవా కేంద్రంలో ఉద్యాన పంటలు, కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. వీఏఏలు గురుస్వామి, రాజేష్, రవి పాల్గొన్నారు.

హొళగుంద: రబీలో వరి పంట సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనాలు పాటించాలని ఏఓ ఆనంద్ లోకదళ్ తెలిపారు. మంగళవారం మార్లమడికి, చిన్నహ్యాట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వరి పంటలో గ్రామ విత్తన పథకంపై శిక్షణ ఇచ్చారు. ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌లో బీమా వర్తించాలంటే రైతులే ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులే ప్రీమియం చెల్లిస్తాయని ఇతరలు సీఎస్‌సీ, ఆర్ఎస్‌కేలో సంప్రదించాలన్నారు.



గూళ్యంలో జొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సునీత, కేవీకే శాస్త్రవేత్త రాఘవేంద్ర

మద్దికెర : పొలం సారవంతంగా ఉంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ బీటీఎం యశ్వంత్, ఏఓ రవి అన్నారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా భూసార కార్డుపై సలహాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ భూసా కార్డు ఉపయోగాల గురించి తెలియజేశారు. ప్రస్తుతం సాగు చేసిన శనగ, జొన్న, వాము పంటల్లో చేపట్టాల్సిన సస్య రక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలిచ్చారు. అనంతరం భూసార పరీక్షల పత్రాలను రైతులకు అందజేశారు. ఏఈఓ భోజరాజు, వ్యవసాయ సహాయకులు జాకీర్ హుస్సేన్, రాణి పాల్గొన్నారు.

మాలలకు రక్షణ కల్పించాలి

ఆలూరు: నియోజకవర్గంలో మాలలకు రక్షణ కల్పించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జి.మహానంది కోరారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు రోజుల క్రితం ముద్దనగేరి గ్రామంలో మల్లికార్జున, నాగేంద్రమ్మపై అదే గ్రామానికి చెందిన బోయ తిమ్మప్ప, ఆదెప్ప, మల్లయ్య, ఎర్రిస్వామి తదితరులు దాడి చేసి చంపుతామని బెదిరించారన్నారు. ఆస్పరి మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో శనివారం సుమారు 20 మంది మాలలపై దాడి చేసినా ఎవరూ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. దనాయకులు హరి, రామాంజనేయులు, వనికేరి చిన్న దుర్గప్ప, రాజు, మూకప్ప పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: నియోజకవర్గంలోని మాల కులస్తులకు రక్షణ కల్పించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది డిమాండ్ చేశారు. మంగళవారం ఆస్పరి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గత శనివారం ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామానికి చెందిన సిద్ద రాముడుపై అదే గ్రామానికి చెందిన కొందరు దాడి చేసినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ రమేష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

6న ఆలూరులో జాబ్ మేళా

ఆలూరు రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ఆలూరులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రాజ్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ,యువకులు శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాజరు కావాలన్నారు. ఉద్యోగుల ఎంపికకు అమరరాజా గ్రూప్, నవ భారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు.ఆసక్తి గల నిరుద్యోగులు వయస్సు 35 ఏళ్ల లోపు ఉండి పది, ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ అర్హత సాధించి ఉండాలి. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 నుంచి రూ.15 వేల వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

పత్తికొండ(తుగ్గలి) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. పత్తికొండ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..హోసూరు గ్రామానికి చెందిన సునీతమ్మతో భర్త శ్రీనివాసులు కొంత కాలంగా దూరంగా ఉంటున్నారు. ఉన్న పొలంలో ఆమె ముగ్గురు పిల్లలను పోషిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఆర్థిక ఇబ్బందులు, తండ్రి దూరంగా ఉంటున్నాడని మనస్తాపానికి గురైన కుమారుడు బ్రహ్మయ్య (20) ఈ నెల 2న పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన తండ్రి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు.

కూటమి ప్రభుత్వానికి రైతులే బుద్ధి చెబుతారు

- నియోజకవర్గంలోని అన్ని సాగునీటి సంఘాలకు వైఎస్సార్ సీపీ పోటీ
- బడ్జెట్‌లో వేదావతి,నగరడోణ రిజర్వాయర్లకు నిధులు కేటాయించకపోవడం దారుణం
- నాయకులు,కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే విరూపాక్షి



కార్యకర్తల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఆయకట్టు రైతులే బుద్ధి చెబుతారని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. మంగళవారం చిప్పగిరిలోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పార్టీ నాయకులు,కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. వచ్చే సాగునీటి సంఘాల ఎన్నికల్లో హెచ్ఎల్‌సీ ,ఎల్ఎల్‌సీ, మైనర్ ఇరిగేషన్ ట్యాంకు అధ్యక్ష స్థానాల్లో వైఎస్సార్‌సీపీ పోటీ చేస్తుందని చెప్పారు. ఇందు కోసం సాగునీటి సంఘం అధ్యక్షులు,టీసీ మెంబర్ల ఎంపిక చేపట్టామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రైతులకు ఎలాంటి భరోసా లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాగునీటి రంగానికి, రైతులకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. వేదావతి, నగరడోణ రిజర్వాయర్ల నిర్మాణాలు ప్రారంభించారని..కూటమి ప్రభుత్వం వీటికి బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. అధికారం కోసం చంద్రబాబు మాయమాటలు చెప్పి రైతులను మోసం చేశాడన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఖరీఫ్ సీజన్‌లో రూ.20 వేలు ఇస్తామని హామీ, రైతుకు పెట్టుబడి సాయం అందించకుండా వంచించారని మండిపడ్డారు. రైతులకు పూర్తి స్థాయిలో విత్తనాలు,ఎరువులు సరఫరా చేయలేదని చెప్పారు. ఎన్నికల ముందు హంద్రీనీవా ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపుతామని చెప్పి నేటి వరకు చుక్కనీరు కూడా సరఫరా చేయలేదన్నారు. ఎస్ఎస్ ట్యాంకుల నిర్వహణ అధ్వానంగా మారడంతో ప్రజలకు తాగునీటి సరఫరా సక్రమంగా కావడం లేదన్నారు. పార్టీ చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య, హాలహర్వి వైస్ ఎంపీపీ నాగేష్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈ నెల 10వ తేదీన విజయవాడలో జరిగే మాదిగల కృతజ్ఞత యాత్ర ముగింపు సభను జయప్రదం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్ మాదిగ పిలుపునిచ్చారు. వెల్దుర్తిలో మంగళవారం సంఘం నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను అమలు చేయాలని కోరారు. ఆగస్టు 16 నుంచి ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు మాదిగల కృతజ్ఞత యాత్ర చేపట్టారని, ఈ యాత్రకు సంబంధించి విజయవాడలో ముగింపు సభ జరుగుతుందని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు టైలర్ రాముడు, జిల్లా నాయకులు టైలర్ కృష్ణ, దానియేలు, మధు, బాలమద్దయ్య, చిన్న చిన్నయ్య పాల్గొన్నారు.



నిట్రవట్టి వద్ద నేలవాలిన వరి పైరు

కొనసాగుతున్న వర్షం

హాలహర్వి: ఫెంగల్ తుపాను కారణంగా వర్షం కొనసాగుతోంది. వర్షం కారణంగా మండలంలోని బాపురం, చింతకుంట, నిట్రవట్టి తదితర గ్రామాల్లో సాగుచేసిన వరి పైరు దెబ్బతింది. ఈదురు గాలులు, తుఫాన్ ధాటికి పైరు నేలవాలింది. దీంతో రైతులకు ఆర్థికంగా నష్టం వాటిల్లింది.

చిప్పగిరి: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న తేలిక పాటి వర్షాలకు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మండలంలో కంది,సజ్జ,వేరుశనగ,కొర్ర,పత్తి,పప్పు శనగ, పొద్దు తిరుగుడు తదితర పంటలు సుమారు 4,500 ఎకరాల్లో సాగు చేశారు. చిప్పగిరితో పాటు బంటుఙహాలు,నేమకల్లు,గుమ్మనూరు,నగరడోణ,ఏరూరు,రామదుర్గం, బెల్డోణ, నంచర్ల తదితర గ్రామాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కంది పైరు చివరి దశలో ఉండడంతో బుడ్డలు నాని పగిలి కంది గింజలు రాలి పోయే పరిస్థితి నెలకొలింది. పప్పుశనగ పూత దశలో ఉండటంతో వర్షాలనికి పూల రాలిపోయి దిగుబడి తగ్గే అవకాశముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు ఎకరాల్లో పంట నష్టం



ఈ ఏడాది ఆరు ఎకరాల్లో వరి పంట సాగుచేశా. కోత దశలో ఉన్న పైరు ప్రస్తుత తుపాన్ ధాటికి మొత్తం ఒరిగిపోయింది. పంటను కోయడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. వరి ధాన్యం రాలిపోయింది. ఆర్థికంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలి.
– పరశురాం, చింతకుంట గ్రామ రైతు



చిప్పగిరిలో పూత దశలో ఉన్న పప్పుశనగ

దివ్యాంగులు మనోస్థైర్యాన్ని కోల్పోరాదు





మాట్లాడుతున్న డోన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంఈఓలు

కృష్ణగిరి: విభిన్న ప్రతిభావంతులు మనోస్థైర్యాన్ని కోల్పోకుండా జీవించాలని డోన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి పేర్కొన్నారు. కృష్ణగిరిలో మంగళవారం జరిగిన ప్రపంచ వికలాంగుల దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు సకలాంగులకు ఏ మాత్రం తీసిపోరన్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికలాంగత్వం కేవలం శరీరానికే కానీ మనసుకు కాదన్నారు. దివ్యాంగులు కలిసికట్టుగా ముందుకు సాగితే హక్కులను సాధించుకోవచ్చన్నారు. అనంతరం దివ్యాంగులను సన్మానించారు. నబిసాహెబ్, శ్రీరాములు పాల్గొన్నారు.

మద్దికెర : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు పోవాలని ఎంఈఓ గోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. హెచ్ఎం విశ్వనాథ్, ఐఈఆర్‌టీలు రాజేశ్వర రెడ్డి, మాధవిలత, ఫిజియోథెరిపిస్టు బాబయ్య పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: దివ్యాంగులు సకలాంగులతో సమానమని ఆత్మస్థైర్యాన్ని నింపుకోవాలని ఆలూరు జెడ్పీ బాలికల పాఠశాల హెచ్ఎం సుజాత అన్నారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందించారు. కోయనగర్ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగస్వామి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోవిందప్ప, సహిత ఉపాధ్యాయుడు రాందాస్, అరుణజ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆస్పరి సీఐ మస్తాన్‌వలి

ఆస్పరి: విభిన్న ప్రతిభావంతులు మానసికంగా కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని సీఐ మస్తాన్‌వలి అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా సెక్రెడ్, ఆదర్శ మండల దివ్యాంగుల సమైఖ్య ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను కించపరచిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఐక్యమత్యంగా హక్కులను సాధించుకోవాలని ఎంఈఓ తిరుమలరావు చెప్పారు. సంఘం అధ్యక్షులు వీరేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకుర రామాంజనేయులు పాల్గొన్నారు.

దేవనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలో విభిన్న ప్రతిభావంతులు ర్యాలీ నిర్వహించారు. ఏఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీపీ ఉమాంబ, ఏబీఎన్ నరసన్న, ఏపీఓ కృష్ణమూర్తి, డీవీఎంసీ సభ్యులు కాకర్ల శాంతికుమార్ పాల్గొన్నారు.



తుగ్గలిలో ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు

తుగ్గలి : దివ్యాంగులు ఎవరికీ తీసిపోరని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే లక్ష్యాలను సాధింగలరని ఈవోపీఆర్డీ శ్రీహరి అన్నారు. సెక్రెడ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం తుగ్గలిలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. తుగ్గలి, మద్దికెర వెన్నెల, మదర్ థెరీసా సమాఖ్య దివ్యాంగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సెక్రెడ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈవోఆర్డీ మాట్లాడారు. ఏపీజీబీ మేనేజర్ శ్రీలత, ఏపీవో హేమసుందర్, సెక్రెడ్ సంస్థ ప్రతినిధులు ప్రసన్నరాణి, మారుతీప్రసాద్, వెలుగు సీసీ ఆంజినేయులు, ఈసీ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ–2 రమేష్ , హెచ్ఎంలు చంద్రావతి, మేరీ, మహేశ్వరరెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త సాయిప్రసాద్ పాల్గొన్నారు.